# పందెపు తోట

## అట్టాడ అప్పల్నాయుడు

జాతరలో తప్పిపోయిన దీనబాలుడిలా- నాగావళి నది, యిసుకమేట అవల, అవతలి ఒడ్డువేపు సన్నగా ప్రవహిస్తోంది.

"మా ఊరికి కన్నతల్లి- నాగావళి నది..." మా మిత్రుడీ మధ్య తరచూ- నీ అపురూప జ్ఞాపకాలు చెప్పు మిత్రమా అనడిగేవాడు. జ్ఞాపకాలు మిగుల్చుకోని జీవితం- జీవితమే కాదని, పెద్దాయనెవరో అన్నారట. అసలిపుడు, జీవితం మిగుల్తోందా యెవరికైనా...? ఏభయ్యేనిమిదేళ్ల జీవితంలో- నాకేమీ మిగల్లేదనిపిస్తోంది, పోగొట్టుకున్నవేవో... జ్ఞాపకాలుగా మిగిలినట్లుంది.

మా ఊరొచ్చేందుకు నిన్న రైల్లో ప్రయాణిస్తూ, మళ్లీ మిత్రుడు జ్ఞాపకాలు చెప్పమన్నపుడు- యీ నది గురించీ, మొదటి అపురూప జ్ఞాపకంగా చెప్పేను. తీరా, నది యిలా...!

"వేసవి రోజులు గదా- నది తగ్గింది. చాలా నదులింతే, వర్షాకాలం పొంగుతాయి, తర్వాత కుంగుతాయి..." ఓదార్పుగా, పలికేడు మిత్రుడు.

ఇద్దరం వెనుదిరిగి, నది ఒడ్డెక్కి, ఊరివేపు నడిచేం.

"...యిప్పటికీ, మనకింకా నదీజలాల వినియోగం తెలీదు..." ఒడ్డెక్కాక, కనబడే పొలాలవేపు చూస్తూ, మిత్రుడు.

కథ



మూరడు యెత్తు పెరిగిన నువ్వు చేలూ, జనపమొక్కలూ, ఇచ్చుకున్న పొద్దు తిరుగుడూ, పత్తిమొక్కలూ- శరణార్థ శిబిరాల్లో కాందిశీకుల్లా కన్పించేయి.

పొలాల గోర్జిలోంచి, ఊరివేపు నడుస్తుంటే, మళ్లీ, మిత్రునితో నిన్న రైల్లో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది... యింకా అపురూప జ్ఞాపకాలు... చెప్పు... అనంటే;

"... పందెపుతోట..." నది తర్వాతి జ్ఞాపక విశేషాన్ని చెప్పేను.

నది ఒడ్డుకి కూతవేటు దూరంలో, రకరకాల మామిడిచెట్లూ, పనసచెట్లూ, పొచి, వేప, మద్ది, టేకు లాంటి కల్పవృక్షాలూ నిండిన తోట! నది తర్వాత, మా ఊరికి ఆటా పాటా వినోదాల వేదిక! తల్లి ఒడిలో ఆడని పిల్లలుండొచ్చునేమో గానీ, నదీ, తోటల ఒడిలో ఆడని పిల్లలు లేరు, మా ఊరిలో. చిరతా, బిళ్ల, కేకరాట, బచ్చాట, కబడీ సకల ఆటలూ...! పండగ రోజుల్లో, ఆ తోటలో చెట్ల కొమ్మలకు ఉయ్యాలలు కట్టి, మా ఊరి ఆడ పిల్లలు- ఆకాశపుటంచులను తాకుతారు. ఆ తోటలోనే, మా నాయుడోళ్ల వీధి జట్టుకి నాయకత్వం వహించి, కబడ్డీ ఆటలో, మా ఊరి అన్ని వీధులవార్నీ ఓడించేను. మాదిగవీధి జట్టుతో ఆడలేదు. ఆడితే- ఓడిపోయుందుమని, మా నాయుడోళ్ల జనార్ధన, గుసగుసగా అనేవాడు.

ఆ తోటలోనే- సైకిల్ తొక్కటం నేర్చుకున్నాను. అపుడపుడూ, మా మేనత్త భర్త, యేదో పని మీద మా ఊరొచ్చేవాడు సైకిల్ మీద. అతను, మధ్యాహ్నం భోజనం చేసి, పడుకునే సమయాన, అతని సైకిల్ని తీసుకొని, నాకంటే రెండేళ్లు పెద్దవాడైన మా రామినాయుడు దద్దను తోడు తీసుకొని- తోటలో ప్రాక్టీస్! ఒకసారి, సీటు మీద కూచొని తొక్కడం వొచ్చేసిందన్న ధీమాతో, మా రామినాయుడు దద్ద గూడా- అంతే, అంతే, వొచ్చేసింది, బయపడకు, కేరేజీ పట్టి కాస్తాన్లే- అంటూ, సైకిల్ని ముందుకు నెట్టి వొదిలేసాడు. పరుగందుకున్న సైకిల్ని బేలన్స్ కాయలేక- నది నుంచి నీళ్లబిందెతో వొస్తోన్న, పొంద్రంకి వరలక్ష్మిని గుద్దేసాను. నీళ్లబిండె బుర్ర మీదుగా కిందపడి, నా బుర్రా, బిందే లొత్తలు పడ్డాయి. భయంతో కాళ్లూ చేతులూ వణుకు. గభాల్న, వరలక్ష్మి కాళ్ల కడియాలకు దండం పెట్టేను వరలక్ష్మి సిగ్గుపడిపోయి, గభాల్న బిందె తీసుకొని పరుగందుకుంది. ఈ దృశ్యాన్నంతటినీ, అంత దూరంనించీ చూస్తోన్న మా దద్ద, పరుగెట్టి వొస్తూ- ఓలె... పొంద్రంకోళ్ల పిల్లా- మా సైకిల్లు వొరసా, వావీ చూసుకునే గుద్దుతాయే- అని కేకేసాడు, నవ్వుతూ.

ఆ పిల్ల, ఆ కేకకు ఆగీ, వెనక్కి తిరిగి చూస్తూ-

"... గండడా. ఆడు గాబట్టి వొదిలీసినాను. నువ్వయినావు గాదు, వొరస తీసి వొడ్డున బెట్టీసి- సితక బొడిసీదును బుర్రని, బిందెతోటి..." అని జవాబిచ్చి, తుర్రుమని పారిపోయింది.

"...హన్నా, గుంట చిగురెట్టింది! ఎళ్లెల్లు, దొరకవా, నీనుగాదు, మా వోడే నీ చిగురు చిక్కిడా..." అని హెచ్చరించినాడు. ఆ తర్వాత వరలక్ష్మి, యెక్కడ యెదురుపడినా, కిసుక్కున నవ్వేది. నాకు సిగ్గేసేది. మా దద్ద గానీ చూస్తే- చిగురు చిక్కిరా దద్దా- అనేవాడు.

ఇంకా, ఆ తోట వొక వీరగాథకు గూడా ప్రసిద్ధి. అప్పట్లో, మా తాతల కాలంలో- దేవుకోన మాన్యపు ఇనాందొరలు అక్కడెక్కడో వేటాడితే, వొక అడవిపంది గాయపడి, తప్పించుకొని, దేవుకోన నుంచి

మా ఊరివేపు పరుగెత్తుకొచ్చిందట. ఇనాందొరలు వొదిలేసారట గానీ, మైదాన గ్రామాలవారు దాన్ని వెంబడించేరట. అడవిపంది పరుగెత్తి, పరుగెత్తి, మా ఊరి తోటలో కూలబడిపోయిందట. మా ఊరి మాదిగలూ, ఊరి ప్రజలూ, పందిని పట్టుకున్నారట. పందిని వెంబడించిన గ్రామాల వారికీ, మా ఊరివారికీ గొడవయ్యిందట. పంది మాదంటే, మాది అని పంతాలకు పోయేరట. వీరునిదే రాజ్యమన్న సూత్రంతో- కొట్లాటకు దిగేరు. మా మాదిగ వీరయ్య కర్ర సాముతో, జనాన్ని చెల్లాచెదురు చేసాడట. మా ఊరి పౌరుషాన్ని నిలిపి- పందిని స్వాధీనం చేసుకున్నాడట! ఆ విధంగా, ఆ తోట ప్రసిద్ధి కాగా- తర్వాత్తర్వాత, తోటలో కోడిపందేలూ, గొర్రెపందేలూ, కుస్తీ పోటీలూ, సంగిడీ సవాళ్లతో- ఆ తోట "పందెపుతోట"గా నామకరణం పొందింది...

తోట గురించిన జ్ఞాపకం చెప్తూ ఆగిపోయేను. మాతో పాటు కూచున్న ప్రయాణీకుడు గూడా ఆసక్తిగా, నా వేపు చూడసాగేడు. ఆ తర్వాత, కొంతసేపటికి- ఊఁ... యింకా, యింకా యేదో అపురూప జ్ఞాపకం చెప్పమన్నాడు మిత్రుడు.

"స్మశానం..." చెప్పేను. మిత్రుడు భయంగా చూసేడు. ఆసక్తి కనబర్చిన ప్రయాణీకుడు గూడా, వెనక్కి చేరబడిపోయేడు...

సరిగ్గా, యిప్పుడు యిద్దరం 'స్మశానం' ప్రక్కన, దోవలో వున్నాం. అదే- స్మశానం, అని చూపించేను. నదికీ, పందెపుతోటకీ మధ్య, ఉత్తరపు మూల స్మశానం.

ఇన్నేళ్ల తర్వాత, నదీ, పందెపుతోట, స్మశానం- అపురూప జ్ఞాపకాలుగా మిగలటం ఆశ్చర్యం కలిగింది. ఎందుకో- అవి జీవన సందేశ ప్రదేశాలన్పించేయి!

ఒకసారి అటువేపు వెళ్లొద్దాం, రా- అని స్మశానం వేపు దారి తీసేను. స్మశానంలో, కాలిబూడిదయిన బంధువులు, వారి జ్ఞాపకాలు, వారి జీవన ఆరాటాలు, గెలుపు ఓటములు, తాతా, తండ్రీ, తల్లీ, బంధువులూ చేరిన చివరి మజిలీ! ఒకటి రెండు చోట్ల దారికోసం వొదిలేసి, చుట్టూ ముళ్ల కంచెలు. ఎత్తుపల్లాల మెట్ట భూమి. బూడిదకుప్పలు, బొమికెలు, పగిలిన కుండలు, తెగిన నల్లపూసల సేర్లు, గాజులు, అనేకానేక విధ్వంస చిహ్నాలు! విధ్వంస సింహాసనం- స్మశానం!

"... దీనికీ, ఆధునిక విద్యుత్ స్మశానవాటికకీ యెంత తేడా? అక్కడేమీ కన్పించదు. పెంకులూ, బొమికలూ, గాజులూ- యీ చిహ్నాలేవీ గూడా..." అన్నాడు మిత్రుడు.

"...అదేగదా, మాయ...! ఆధునికత దేన్నీ మిగల్చదు. యేదీ కనబడదు, అంతా బూడిద! చివరికి, మన జ్ఞాపకాలు గూడా..."

మిత్రుడేదో ఆలోచిస్తున్నాడు. నాకు మళ్లీ, రైల్లో సంభాషణ, ఆగిన దగ్గర నుంచీ, గుర్తుకొస్తోంది...

స్మశానం గురించి మరోసారి చెప్పుదువు, పందెపు తోట గురించి చెప్పు- అన్నాడు మిత్రుడు. ఈసారి, సహ ప్రయాణీకుడు, ముందుకు వంగి, వినసాగేడు...

ఆ పందెపు తోటలో అనేక కోళ్లూ, గొర్రెపందేలు జరిగేయి. నెత్తురొలికేది. ఈలలూ, కేకలూ, రోషావేశాలూ...! రెండు సంఘటనలూ, ఇద్దరు వ్యక్తులూ- బాగా గుర్తుండిపోయేరు. అందులో వొకరు- గండి పోలినాయుడు.

గండి పోలినాయుడి- ఎడమ ముంజేతికి కంకణంలాంటి బంగారుచైను తొడిగిన, బంగారు రంగు వాచీ వుండేది. ఆ వాచీ ప్రసిద్ధ కంపెనీకి చెందినది. ఆ రోజుల్లో తిరుపతి యాత్రకు వెళ్లినపుడు, అట్నించి అటు మద్రాసెళ్లి, ఎంజీయార్నీ, ఎమ్జీవోడ్నీ చూసి, పాండీ బజార్లో గీచిగీచి బేరమాడిన వాచీ అది. పాండీ బజారు గురించీ, అక్కడి యాపారం, మాయా గురించీ- యెంత చెప్పేడో, అందరితో! ఆ వాచీకి గల కంపెనీ చెయిన్ పీకించేసి



ఒకసారి అటువేపు వెళ్లొద్దాం, రా- అని స్మశానం వేపు దారి తీసేను. స్మశానంలో, కాలిబూడిదయిన బంధువులు, వారి జ్ఞాపకాలు, వారి జీవన ఆరాటాలు, గెలుపు ఓటములు, తాతా, తండ్రీ, తల్లీ, బంధువులూ చేరిన చివరి మజిలీ! ఒకటి రెండుచోట్ల దారికోసం వొదిలేసి, చుట్టూ ముళ్ల కంచెలు. ఎత్తుపల్లాల మెట్ట భూమి. బూడిదకుప్పలు, బొమికెలు, పగిలిన కుండలు, తెగిన నల్లపూసల సేర్లు, గాజులు, అనేకానేక విధ్వంస చిహ్నాలు!

బంగారం చెయిన్ పెట్టించుకోమని, భార్య తన మెడకి యిరుకయిపోయిన, పట్టెడ తీసి యిచ్చిందట. మా ఊరి కంసాలి దాసుకి ఆ పట్టెడ యిచ్చి, వాచీకి చెయిన్ చేయించేడు. చెవులకి తమ్మిట్లూ, మెడలో పులిగోరు పతకం, చేతివేళ్లకు ఉంగరాలూ- తళతళ మెరుస్తూ కన్పించేవాడు. మా ఊరికి సమీపాన గల ఆదివాసీ గ్రామవాసి గనక, అతని మాట గూడా ఆదివాసీ యాసతో, మాకు భిన్నంగా వుండేది.

మా ఊరిలో జరిగే ఆదివారపు సంతకు అపుడపుడూ వొచ్చేవాడు. సంక్రాంతి తర్వాతి ముక్కనుమ పండగరోజు నుండి, శివరాత్రి పోయేదాకా మా ఊరి పందెపుతోటకు, రోజూ వొచ్చేవాడు. యే రోజో అతను రాకపోతే- ఆ రోజు పందెపు తోట, నాట్యకారుడు లేని నర్తనశాల అన్పించేది! అతని దగ్గర కేవలం ప్రయాణం కోసమే- రెండు జతల ఒంగోలు యెడ్ల బళ్లుండేవి. రంగు రంగుల ముఖమల్ తెరలూ, మెత్తటి దూది పరుపులూ, యెడ్ల మెడలో నిండుగా గంటలూ, మువ్వలూ- చూడముచ్చటగా వుండేవి. బండి తోలే మంగయ్య చేతిలో, పువ్వుల కొరడా వుండేది. దాన్ని యెవర్నీ ముట్టనిచ్చేవాడు కాదు.

పోలినాయుడితో అయిదారు కోడిపుంజులు బండి దిగేవి. కోడిపుంజుల కాళ్లకు కట్టే చిన్నపాటి చురకత్తుల పొదీ, యేవో పసరుమందులూ, వొక చిన్నపాటి సీసాలో వంటసారా వగైరా సరంజామాతో, బొబ్బిలి బావాజీ దిగేవాడు. పోలినాయుడు, ఉంగరాల్నీ, వాచీనీ, పులిగోరు పతకాన్నీ, మూతిమీది మీసాన్నీ సవరించి, సవరించీ- సవాల్ విసిరేవాడు. మా నాయుడోళ్ల పుంజుల్నో, పరిసర గ్రామాల పుంజుల్నో, పోటీకి దించేవారు.

పుంజులు బరిలో దిగి, యెగిరి పోరాడుతున్నపుడు, బావాజీ వొదుపుగా తన పుంజుతో పాటూ కదుల్తూ, అది ప్రతికక్షి పుంజు కడుపులోనో, కంఠమ్మీదనో కత్తి కాలిని విసరగానే- అయిపోయింది, సూస్కోండి, సఫా... -అని కేకేసి, తన పుంజును అందుకొని, దాని ముక్కులోకి గాలి ఊది, రెక్కల్నీ, కాళ్లనూ సవరించి హుషారుగా పోలినాయుడికి చూపించేవాడు. బావాజీ అన్నట్టే అవతలివారి పుంజు నెత్తురోడేది. అవతలివాళ్లు- ఆ గాయమ్మీద నూనె, కారపుగుండా పూసి, కట్టుగట్టి- బరిలోకి

దింపేవాళ్లు. గానీ, అది కూలిపోవటమో, వెనుదిరిగి, వెఱ్రికూతతో పారిపోవడమో చేసేది! "పాడవా అయిపోయిందదిగో- పందెం గెలుపు నాదే..." అని, మీసం సవరించేవాడు పోలినాయుడు.

మా మైదాన గ్రామాల పుంజులూ పోరా డేవి, గానీ వాటికి బావాజీ యిచ్చే శిక్షణ లాంటి శిక్షణ లేదు. అంచేత, నాటుగా, మోటుగా, భీకరంగా పోరాడేవి. కుత్తుకలు తెగి కూలిపోయేవి. పోలినాయుడి కోడి పుంజులను జయించలేకపోయేవి. అప్పటికీ, కొందరు మోతుబరి నాయుడులు- అల మండా, డెంకాడ రాజుల దగ్గర పెద్దొరస పుంజులను కొనితెచ్చి, వాళ్ల చాకలీ, మంగలీల దగ్గర పెంపకానికి పెట్టి, పందే నికి దించేవారు. అయినా- పాడవా అయి పోయేవి.

పోలినాయుడితో- మా ఊరూ, పొరుగు ఊళ్ల నాయుడోళ్ల కుటుంబాలు బంధుత్వం కలుపుకోవడానికి వువ్విళ్లూరుతుండేవి. అత నికి, అప్పటికి యుక్తవయసు కొడుకులు యిద్దరూ, మరో చిన్న కొడుకూ, వీరిమధ్య యిద్దరు కూతుళ్లూ వుండేవారు. యుక్తవ యసు కొడుకు లిద్దరూ, తండ్రితో పాటూ పందెపు తోటకు వొ చ్చేవారు. యువరాజుల్లా దలామణి అయ్యేవారు. అందులో పెద్ద యువరాజు, ఆ రోజుల్లోనే మా ఊరిముందర వొక రైస్‌మిల్లు పె ట్టేడు. ఆ తర్వాత, కొద్దినాళ్లకే, ఆ యువరాజుతో- పాండ్రంకి వరలక్ష్మికి పెళ్లి జరిగింది. యువరాజు, రైసుమిల్లు ప్రక్కన వొక యిల్లు కట్టుకొని, కాపురం పెట్టేడు.

"... వొరసయినోళ్లందరూ ఆలూమొగలయిపోరు. యెవ్వళికెవ్వ ళు రాసుంతారో...!" మా రామినాయుడు దద్ద- నన్ను వోదార్చ బోయేడు. నిజానికి, మా దద్ద అలా అనాల్సిన అవసరం లేదు. వరలక్ష్మి జ్ఞాపకాలేమీ నాలో లేవు. అప్పటికి నేను, ఎస్సెల్సీ అయిపోయి, సివిల్ యింజనీరింగు కోర్సు, శ్రీకాకుళంలో చేస్తు న్నాను. నదీ, తోటా గాక, కొత్త వ్యక్తులూ, స్థలాలూ, ఆలోచన లూ- పరిచయమవుతున్న కాలమది నాకు.

అప్పటికి, మా గ్రామంలోనా, పరిసర గ్రామాల్లోనా చేరిన కొత్త పాలనా వ్యవస్థలో, ఎన్నికలూ, కొత్త వ్యాపార శ్రేణులూ- తొలుత గ్రామీణుల్లోని సఖ్యతను దెబ్బగొట్టి, తర్వాత వారి మధ్య వైరుధ్యాన్ని పెంచి పోషించేయి. వివాదాలూ, గొడవలూ, కోర్టుకేసులూ- అప్పుల్లో మునగడాలూ, పంటల్ని చెల్లించుకోవటా లూ, వ్యాపారశ్రేణుల గుప్పిట గ్రామాలు బందీ గావటాలు...! ఆ రోజుల్లోనే, అలా చిదిగిన చిన్నరైతు, మా రామినాయుడు దద్ద- ఊరొదిలి విజయవాడ వలసపోతూ- భూమీ, పుట్టా కడుపుకి తిండి పెట్టినట్టగ లేదు, బూమీ పుట్టా అమ్మీసయినా బాబుని సదివించండని, మా తల్లిదండ్రులకూ, బాగా సదివి, వొంశానికీ, వూరికీ పేరు ప్రతిష్టలు తేవాలని- నాకూ, హితవు చెప్పేడు.

మా దద్ద కోరినట్లు చదువులో మునిగిపోయేను. మూడేళ్లు ఊరెళ్లలేదు. నాలుగోయేట, సంక్రాంతి పండగకు ఊరెళ్లినపుడు, ముక్కనుమరోజు పందెపు తోటలో జరిగిన సంఘటన, మరొక మరపురాని జ్ఞాపకం...

పందెపు తోటలో ఆరోజు, పోలినాయుడి ఎడ్లబండి ఆగిన కొద్దిసేపట్లో గణగణగణ గంటలు మోగిస్తూ, ఒంగోలెడ్ల బండ్లు మరి రెండు ఆగేయి. సుమారు పెంపుడు కుక్కలంత యెత్తున్న కోడిపుంజుల్ని పట్టుకొని నలుగురు మనుషులు, వొక బండి లోంచీ, పొత్తికమీజూ, సాటిన్ సుర్వా, వొంకీ కిర్రుచెప్పులూ, కళ్లకు బంగారం ఫ్రేము చలువ కళ్లద్దాల్తో వొక పెద్దమనిషి మరో



సూరపురాజు పుంజులను ఓడిం చేందుకు, బావాజీని యెక్కడెక్కడికో పంపించి, మంచి మంచి కోడి పుంజుల్ని కొనిపించి, బాగా తర్ఫీదు యిప్పించేవాడట పోలినాయుడు. అందుకోసం, మడిచెక్కల్ని యేటా వొకటి రెండు అమ్ముకోవలసి వచ్చేదట. అయినా, సూరపురాజు పుంజుల్ని ఓడించలేకపోయేడట! అవమానంతో రగిలిపోయేవాడట.

బండిలోంచీ దిగేరు. పందెపుతోట నిచ్చెర బోయింది. ఆయన కొత్తపట్నం సూరపు రాజుగారు! పట్నంలో వ్యాపారాలూ, పల్లెలో వ్యవసాయాలూ- రెండు కళ్లు ఆయనకు.

సూరపురాజు కోడిపుంజుల కాళ్ల పొడవు వుండవు, ఆ తోటలో దిగిన పందెపుకోళ్లు. అటూ, యిటుగా పోలినాయుడి పుంజులే- సమ ఉజ్జీలు!

బావాజీ, దించు- అనన్నాడు పోలినాయు డు. బావాజీ, పెద్దొరస పుంజుని, డింకీ పందేనికి దించేడు. డింకీ పందెంలో, పుంజుల కాళ్లకు కత్తులు కట్టరు. ఉత్త కాళ్ల తోనే పోరాడాలి. సూరపురాజు పుంజు కాళ్లు దువ్వింది- దుమ్మురేగింది. పుంజులు రెండూ మొగుసుకున్నాయి. ఎగిరి కాళ్లతో తన్నుకున్నాయి. ముక్కుల్తో పొడుచుకు న్నాయి. రెక్కల ఈకలు కొన్ని నేల రాలేయి, ముక్కులు ఎరుపెక్కేయి. బావాజీ పుంజుతో పాటూ, యెగురుతున్నాడు. పుంజులు కాళ్లు విసిరి తన్నుకొని విడి పోయి, మళ్లీ మొగుసుకున్నప్పుడల్లా- తన పుంజుని అందుకొని, దాని ముక్కులోకి గాలి వూది, సీసాలోని సారా చుక్కల్ని, పుంజు గొంతులోనా, కళ్లల్లోనా పోసి, బరిలోకి దించుతున్నాడు. తొలిసారిగా, పోలినాయుడి పుంజు బరిలో కూలబడిపోయింది. మరో పుంజు దించేరు, అదీ ఓడిపోయింది. మరొకటీ... అదీ! పోలినాయుడికి తల కొట్టేసినట్లయ్యింది. ఆరోజు, కోడిపుంజుల్ని పోగొట్టుకొని, మౌనంగా పోలినాయుడి బండి పందెపుతోట నుం డి వెనుదిరిగింది. సూరపురాజు ఎడ్లబండ్లు- గెలిచిన పుంజుల్తో గణగణ గంట మోతల్తో కదిలాయి.

ఆ తర్వాత, సూరపురాజు పుంజులను ఓడించేందుకు, బావా జీని యెక్కడెక్కడికో పంపించి, మంచి మంచి కోడిపుంజుల్ని కొనిపించి, బాగా తర్ఫీదు యిప్పించేవాడట పోలినాయుడు. అందుకోసం, మడిచెక్కల్ని యేటా వొకటి రెండు అమ్ముకోవలసి వచ్చేదట. అయినా, సూరపురాజు పుంజుల్ని ఓడించలేకపోయేడ ట! అవమానంతో రగిలిపోయేవాడట. ఆ రోజుల్లోనే, యిటు పంటలు సరిగా పండక, యింటిలో యిబ్బందులూ, అటు, రైస్ మిల్లు సరిగ్గా నడవక నష్టాలొచ్చి, వరలక్ష్మి ఒంటిమీది వొక్కో బంగారు నగా, వ్యాపార్ల యిళ్లకు చేరేదట. యువరాజులు- రాజ్యాన్ని పంపకం చెయ్యాలన్నారట. ఇంటా, బయటా తెలియ ని పందెమేదో జరగ్గా, వోడిపోతున్నట్లుండేదట, పోలినాయుడికి. సూరపురాజు మీద కసితో, పగతో రగిలిపోయేవాడట! గానీ, సూరపురాజు మాత్రం- స్నేహహస్తమే చాచేవాడట. రైస్ మిల్లుని నష్టాల్లో నడిపేకంటే, దాని స్థానంలో 'టూరింగ్ టాకీస్' పెట్టమని సలహా యివ్వడమే గాక, పెట్టుబడి గూడా యిచ్చి సహకరించేడట! దాంతో, తర్వాత, ఆ టూరింగు టాకీసులో 'దసరా బుల్లోడు' సిన్మా బాగా ఆడటంతో, వరలక్ష్మి వొంటి మీదకి మళ్లీ బంగారు నగలన్నీ చేరేయిట.

ఆ రోజుల్లో గ్రామాలన్నిటా బాగా మార్పులొచ్చేయి. పట్నంతో అనుసంధానమైనాయి. కొత్త పంటలూ, కొత్త మార్కెట్లూ, బస్సు లూ, సిన్మాహోళ్లూ, హోటళ్లూ, పత్రికలూ, కాలేజీ చదువులూ, గ్రామాల్ని చుట్టుముట్టాయి. ఆహార పంటలకు దూరమయి, వ్యాపార పంటలకు దగ్గరయినాయి, పొలాలు! రైతులు చిదిగీ, వ్యాపార్లు యెదగటం, చదువుకున్నవాళ్లకు నౌకరీలు అమరటం, సారా వంటా, కలప స్మగ్లింగూ, రోడ్లూ, బిల్డింగులూ, కాలవలూ కాంట్రాక్టు పనులూ వంటి కొత్త ఆదాయ మార్గాల్లో కొందరు పయనించటం...

(మిగతా 38 పేజీలో)

# జ్వరాలకు హోమియో వైద్యం

జ్వరాలు విభిన్న రకాలు. అనేక కారణాల వల్ల ఈ జ్వరాలు వస్తుంటాయి. కొందరికి కొన్నిసార్లు జ్వరం వచ్చినట్టే వచ్చి తగ్గిపోతుంటుంది. కొంతమంది పగలు బాగానే వుంటారు. రాత్రి కాగానే జ్వరం వస్తుంటుంది. ఇంకొందరికి లోజ్వరం వుంటుంది. పైకి మామూలుగా కనిపిస్తారు. కానీ లోపల వేడిగా వుంటుంది. జ్వరంతో బాధపడుతుంటారు. అనేక రకాల జ్వరాలు అనేకానేక కారణాల వల్ల వస్తుంటాయి. కొందరు కొన్నాళ్ళు మందులు వాడగానే తగ్గినట్టే తగ్గి మళ్ళీ వస్తుంటుంది. సరయిన కారణం తెలుసుకోకుండా చికిత్స జరపడం వల్ల ప్రయోజనం వుండదు. మందులు మార్చగానే సరిపోదు. అసలు కారణాన్ని గమనించాలి. తగిన చికిత్స చేయాలి. హోమియో వైద్య విధానంలో జ్వరాలు నయం కావడానికి మంచి మందులున్నాయి.

అప్పుడప్పుడు వచ్చి తగ్గిపోయే జ్వరాలతో సమస్య లేదు. కొన్ని రకాల జ్వరాలు ప్రబలిపోతుంటాయి. కొందరికి తరచుగా జ్వరాలు వస్తుంటాయి. వీటికి అనేక అంశాలు కారణం. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడల్లా కొందరు జ్వరపడుతుంటారు. మారే వాతావరణంతో సర్దుబాటు కావడానికి వారికి సమయం పడుతుంది. ఈ లోపల అస్వస్థతకు లోనవుతారు. ఇంకొందరు ప్రయాణాల వల్ల త్వరగా అలసిపోతే జ్వరం వస్తుంది. దోమకాటు వల్ల కొన్నిరకాల జ్వరాలు వస్తుంటాయి. కొందరికి తలనొప్పి, జలుబుతో మొదలయి జ్వరం వచ్చేస్తుంది. మలేరియా, ఇన్‌ఫ్లూయంజా, టైఫాయిడ్, సన్నిపాత జ్వరం మొదలయిన వివిధరకాల జ్వరాలు వచ్చినప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఆరోగ్యం**

కొందరికి జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్ళీ వస్తుంటుంది. ఇంకొందరికి రోజు విడిచి రోజు వస్తుంటుంది. మరికొందరికి మూడు రోజులకోసారి వచ్చి తగ్గుతుంటుంది, మళ్ళీ వస్తుంది. కొందరికి జ్వరంగా వున్నప్పుడు బాగా చలి పెడుతుంది. అది తగ్గినట్టే తగ్గి మళ్ళీ జ్వరం పెరుగుతుంది. చెమటలు పడుతుంటాయి. దాహం అవుతుంటుంది. మలేరియా జ్వరంలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్నిసార్లు మామూలు జ్వరమే అనిపించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ అది ముదిరితే కష్టం. అలాగే ఇతర రకాలయిన లక్షణాలుంటే తీవ్రమవుతుంది. అందువల్ల జ్వరాలకు సంబంధించి వెంటనే వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవడం అవసరం. వివిధరకాల జ్వరాలు తగ్గడానికి హోమియోలో తగిన చికిత్స లభిస్తుంది.

* సాధారణ జ్వరాలకు కొన్నిరకాల మందులు కచ్చితంగా పనిచేస్తాయి. తలనొప్పి, గొంతునొప్పి, జలుబుతోపాటు జ్వరం వున్నప్పుడు ఫెర్రంఫాస్ 6 ఎక్స్ వాడాటం మంచిది.
* కొందరికి పగలు జ్వరం తగ్గి, సాయంత్రాలు వస్తుంటుంది. ఇలాంటివారికి కాలి సల్ఫ్ 6ఎక్స్ నాలుగు గంటలకోసారి ఇవ్వాలి.
* విపరీతంగా తుమ్ములు రావడం, జలుబు చేయడం, కళ్ళ వెంట నీరు కారడం జ్వరం వచ్చి ఒళ్ళంతా నొప్పులుగా వుంటే నేట్రంమూర్ 6 ఎక్స్ ఇవ్వడం ఉపయుక్తం.
* మామూలుగా వచ్చే జ్వరం నాలుగురోజుల కన్నా ఎక్కువగా వున్నా, నాలుకపై గోధుమరంగు పూత కనిపించినా వెంటనే మందులు మార్చాలి. ఇలాంటప్పుడు కాల్కేరియాఫ్లోర్ 12 ఎక్స్ మూడు గంటలకోసారి ఇవ్వాలి. రోగిని జాగ్రత్తగా గమనిస్తూ టైం ప్రకారం మందులు వాడాలి.

మలేరియా జ్వరం తగ్గడానికి హోమియోలో మంచి మందులున్నాయి. నేట్రంమూర్, ఫెర్రంఫాస్, మేగ్‌ఫాస్, కాలీమూర్, కాలీఫాస్ మొదలయిన మందుల్ని రోగి పరిస్థితిని బట్టి తగిన డోసుల్లో ఇస్తారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలి. వారి సలహా ప్రకారం, వారు సూచించిన ఆహారం మాత్రమే తీసుకోవాలి. మందులు అందరికీ ఒకేవిధంగా వుండవు. రోగి వయసు, రోగనిరోధకశక్తి, ఇంతకుముందు వున్న ఇతర వ్యాధులకు సంబంధించిన సమాచారం, జ్వరం రావడానికి గల కారణాల్ని బట్టి ఎలాంటి మందులు వాడాలో చెబుతారు. ఇందుకు అనువుగా క్రమబద్ధమైన రీతిలో మందులు వాడటం వల్ల జ్వరం తగ్గి ఉపశమనం లభిస్తుంది.

– డాక్టర్ దండెపు బస్వానందం

# పందెపు తోట

(22వ పేజీ తరువాయి)

"... పిడకలు మునిగిపోయి, రాళ్ళు తేలిపోతన్నాయిరా, నాయినా! ఊరు యింతకమునుపులాగ లేదు..." అని రామునాయుడు దద్ద, వోసారి, ఊరు చూసొచ్చి, వాపోయేడు. అప్పటికి నేను గూడా, ఉద్యోగం కోసం పరాయి నేలల్లో బతకటం, పెళ్ళీ, బతుకు యాతనలో...! ఆ తర్వాత చాన్నాళ్ళు మరి నేను ఊరు వెళ్లలేదు. ఎప్పుడో, యెన్నాళ్లకో వెళ్లినా, పరాయి నేలకు వెళ్లినట్లే వుండేది. నదీ, తోటా, స్మశానమే... మారనివిగా కన్పించేవి! గానీ తోట గూడా...?

"... ఏదో, బతికేసాం. గానీ, వెనక్కి తిరిగి చూసుకుంటే, విషాద యాత్రలా అన్పిస్తోంది..." నా, యీ ఆఖరి మాటల్తో మిత్రుడూ, సహ ప్రయాణీకుడూ- కాసేపు, గంభీర మౌనమూర్తులయినారు. "... చూసేవా? చాలాసేపు మనం- స్మశానం దగ్గరే గడిపే సాం! అసంకల్పితంగా, అందరూ స్మశానం దగ్గర- మొత్తం జీవితాన్ని వలపోసుకుంటారు కదా?" అనడిగేడు మిత్రుడు. స్మశానం నుంచి, ఊరివేపు దారితీసేం.

ఊరు పూర్తిగా మారిపోయింది. గొల్ల వీధీ, చాకలివీధీ, మేదర వీధీ యేదీ లేదు. మా నాయుడోళ్ల వీధి గూడా లేదు. మా దాయాదులు కొందరు వలసపోగా, కొందరు బి.సీ. కాలనీలో వుంటున్నారు. మా వీధిలో- వొక కాన్వెంటూ, వొక ఇనుమూ, సిమెంటు దుకాణమూ కన్పిస్తాయి. ఊరిపుడు- ఇందిరమ్మ కోలనీ, ఎన్టీఆర్ నగర్, అంబేద్కర్ నగర్- యిలా యేవో పేర్లతో, విడివిడిగా, కన్పిస్తోంది. ఊరి ముందరి టూరింగు టాకీసు స్థానంలో మినరల్ వాటర్ బాటిల్స్ కంపెనీ నిల్చింది. ఊరు మండల కేంద్రమైంది.

"ప్రవహించే నదీ, సారవంతమైన పంటభూములూ, శ్రమించే ప్రజలూ వుండి గూడా- మా ఊళ్లకు బతుకులెందుకు లేవో బోధపట్టం లేదు...?"

"జూదంలో యెక్కువమంది ఓడిపోతారు, కొద్దిమందే విజేతలవుతారు..." బదులిచ్చేడు మిత్రుడు.

"... పందెపు తోటలో, యే కొద్దిమంది మోతుబరి రైతులో తప్పా- అందరూ జూదమాడలేదు. అలా, పాడవలేదు..."

"... ఛథా, పందెపు తోట గురించి కాదు, కనబడని పందెం జరుగుతోంది, ఊళ్లూ, బస్తీలూ, పట్నాలూ, నగరాలూ, దేశాలూ... పందెపు తోటలో వున్నాయనే నా ఉద్దేశం..." అని, బదులిచ్చి, యింతకీ, ఆ పందెపు తోట చూపించు అనడిగేడు మిత్రుడు. ఇంకెక్కడ మిగిలింది పందెపుతోట? మొదట్లో, పంచాయితీ కార్యాలయం కొంత ఆక్రమించగా, యిటీవల మండల కార్యాలయం మరికొంత భాగాన్ని మింగేసింది. ఇంకొంత భాగంలో, పోలీసుఠాణా నిలబడింది. మరొక్కాడ గ్రామీణబ్యాంకూ, రెవిన్యూ కార్యాలయం! కొసగా కొంత మిగిల్తే, ఆసుపత్రి, అంగన్‌వాడీ భవంతీ చోటు చేసుకొని, వొక్కో నిర్మాణానికి వొక్కో వృక్షమూ కూలిపోయి, తోటమొత్తం వృక్షాలు ఖాళీ అయినాయి. పేరు మాత్రమే మిగిలింది! అదే చూపించు పోనీ, అనన్నాడు మిత్రుడు. కార్యాలయాలూ, కార్లూ, మోటార్లూ, కాగితాలూ, ఫైళ్లూ, రూల్సూ, పవర్సూ, పథకాలూ, నిబంధనలూ, యేవేవో కన్పించేయక్కడ, మనుషులకి బదులు! అదే పందెపుతోట- అని చూపేను.తోట ఆ చివర, ఊర్లోకి దారి తీసే చోట- అంగన్‌వాడీ భవంతి! ఇక్కడే, తొలిసారిగా సైకిల్ నేర్చుకుంటూ, వరలక్ష్మికి డేషిచ్చేనని చూపించేను. బడి యీడురాని పిల్లలు, బంతి కూర్చున్నారక్కడ. ఒక వయసు మళ్లిన స్త్రీ, వారికి జొన్న ఉప్మా వడ్డిస్తోంది. నలిగిన నూలు చీరా, తైలానికి నోచుకోని కేశాలూ మెడలో పసుపుతాడూ...ఆమె, పిల్లల కోడిలా వుంది. ఓడిపోయిన వంశపు వారసులకు- యింత ముద్ద తిన్పించే తల్లిలా...!

"... వరాలు మామ్మా, కసింత ఉప్మా యెయ్యవూ..." కీచు గొంతుతో, అరిచేడో పిల్లోడు! అప్పుడామెను చూసేను-వరలక్ష్మి!

మనసంతా వికలమైంది. ఆమే- వరలక్ష్మి అని, మిత్రునికి చెప్పలేకపోయేను.